# నిచ్చెన ( నాటిక )

రచన : శంకరమంచి పార్థసారథి

ఇందులోని పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | గీత | - | 25 సం ॥ లు ( భార్యాభర్తలు, ఉద్యోగస్తులు ) |
| 2. | ఆనందరావు | - | 30 సం ॥ లు ( భార్యాభర్తలు, ఉద్యోగస్తులు ) |
| 3. | కోదండరామయ్య | - | 50 సం ॥ లు ఇంటి యజమాని, ప్లీడరు, గుమాస్తా |
| 4. | మూర్తి | - | 25 సం ॥ లు నిరుద్యోగి |

# నిచ్చెన ( నాటిక )

రచన : శంకరమంచి పార్థసారథి

( తెర తీయగానే గోడకు అందమైన ఫోటోలు, విలువైన వస్తువలు, పర్నిచరుతో అందంగా అలంకరించబడిని హాలు కనిపిస్తుంది. ఆ హాలుకు మూడు ద్వారాలు. మధ్యనున్న ద్వారం గీతా, అనందరావుల పడక గది. కుడివైపు ద్వారం – వంటగది బాత్‌రూమ్‌లుకు. ఎడమవైపు ద్వారం పాత్రల ప్రవేశ నిష్క్రమణ – ఆనందరావు అప్పుడే షేవింగ్ పూర్తి చేసుకుని టవల్‌తో మొహం తుడుచుకొంటూ )

ఆనందరావు : గీత, గీతా త్వరగా రావోయ్, నీ వంటిల్లు సద్దుడు పూర్తి అయ్యేసరికి నాకు వార్ధక్యం వచ్చేలా వుంది.( అరుస్తాడు )

గీత : ( లోపలినుంచి ) అబ్బబ్బబ్బ ఏమిటండి ఆ గావుకేకలు ఎవరైనా వింటే నవ్విపోతారు.

ఆనంద : నవ్వనీ, నవ్వేవాడు, నవ్వించేవాడు సమాజానికి టానిక్కు లాంటి వాళ్ళని ఎక్కడో చదివాను. అరే కాఫీ, అర్జంటుగా కాఫీ తాగాలి పట్టుకురా ( అరుస్తాడు )

గీత : ( లోపల్నుంచే ) నాకు ఆఫీసుకు టైము అవుతోంది కాస్త యిలా వచ్చి తీసుకుని వెళ్ళండి.

ఆనంద్ : యిదండి పరిస్థితి, నా కాఫీ నేనే తెచ్చుకోవాలిట. సెల్ఫు సర్వీంగ్ సిస్టం. యింకా నయం. నా కాఫీ నన్నే తయారు చేసుకోమంది కాదు.. గుడ్డిలో మెల్ల...

ఛీ ఛీ ఛీ ఛీ ...

ఉద్యోగం చేసుకునే ఆడవాళ్ళను కట్టుకున్నంత మహా పాపం ఇంకోటి వుండదు.

గీతా :( కాఫీ గ్లాసుతో వచ్చి ) ఏమిటి, మీలో మీరే ఏమిటో గొణక్కుంటున్నారు. కాస్త అలా వచ్చి కాఫీగ్లాసు తీసుకొనివెడితే అరిగిపోతారా ? లేక మీ పురుషత్వానికి భంగమా ?

ఆనంద్ : ఏమన్నావ్ ?

గీతా : ఊ తీసుకోండి. అయ్యో పాపం, చాకిరీతో సతమతమైపోతోందే నన్న జాలిగూడా లేదే. ఏం మొగుళ్ళండి బాబు.

ఆనంద్ : ( కాఫీ చప్పరిస్తూ ) సరేలే. ఏమీ లేకుండానే మీరు నెత్తిన ఎక్కి కూర్చున్నారు. యింకా మేము కాస్త జాలి కూడా చూపిస్తే అక్కడే పిండికూడా కొడతారు. యిక మా అడ్రసులు కూడా దొరకవు. జాలిట జాలి.

గీతా : గింజుకోవడం చాల్లేండి. రాత్రి అంత లేటుగా వచ్చారు ఎక్కడకు వెళ్ళారు ?

ఆనంద్ : తరతరాలుగా ఆలస్యంగా వచ్చిన ప్రతి మొగుణ్ణి భార్య అనేశాల్తి అడుగుతున్న ప్రశ్నే యిది. విని విని విసుగెత్తిపోయాం. కాస్త వెరైటీకోసం యింకేదైనా అడుగకూడదూ... అయినా మగాడు అన్న తరువాత సవాలక్ష వ్యవహారాలు వుంటాయి. అవన్నీ నీకెందుకు ? అవతల నీ కాఫీసుకు టైము అవుతోంది వెళ్ళు వెళ్ళు వెళ్ళు వెళ్ళు....

( అంటూ హ్యాండ్‌బ్యాగ్, టిఫిన్ బాక్సు యిచ్చి గీతను బయటకు పంపించబోతాడు )

గీతా : భార్యను శాల్తి క్రింద జమకట్టే భర్తనుంచి యింతకన్నా మంచి సమాధానం వస్తుందని ఆశించడం నా అవివేకం.

ఆనంద : అబ్బబ్బా... గీతా శీతాకాలపు ఉసస్సుని రోహిణీకార్తె మిట్ట మధ్యాహ్నం చేయకు. ఆగదు ఏ నిమిషం నీ కోసము ఆగితే సాగదు యీ లోకము... క్విక్ క్విక్ !

( పాడుకుంటూ షేవింగ్ సెట్ తీసుకుని లోనికి వెళ్ళుతాడు )

గీతా : కళ్ళు తెరిచి జరుగుతున్నది తెలుసుకోవడం ఆలస్యం అయితే నష్టంగాని, నిజం తెలుసుకోవడానికి ఆఫీసుకు ఒక్కరోజు శలవు పెడితే ఏం ఫర్వాలేదండి.

( నిరుద్యోగి మూర్తి కూరల సంచితో ప్రశేశించుతాడు )

మూర్తి : ఇవిగోనండి కూరలు. తోటకూర దొరకలేదు, పాలకూర తీసుకొని వచ్చాను. ఇదిగో చిల్లర ( ఇవ్వబోతాడు )

( డ్రాయరు సొరుగులోనుంచి గీత ఒక తెల్ల కాగితం తీసి సంతకం చేసి మూర్తికి యిస్తూ ...)

గీతా : చిల్లర నువ్వు తీసుకో ఈ కాగితంపై సంతకం చేశాను. నాకు ఒంట్లో బాగోక ఈ రోజుకు ఆఫీసుకు రావడం లేదని పూర్తిచేసి మా ఆఫీసులో యిచ్చేసేయి.

మూర్తి : అలాగేనండి

( అంటూ ఆ కాగితం తీసుకుని వెళ్ళిపోతాడు )

ఆనంద్ : ( ప్రవేశిస్తూ ) ఒహెూ అదా విషయం.

గీతా : అంటే.

ఆనంద్ : అంటే యివ్వాళ్ళ ఆఫీసుకు శలవు పడేశావు కదా. మరి యింకేం నేనూ ఆఫీసుకు కన్నుకొట్టేస్తా. ఎంచక్కా యిద్దరం హేండు టు హేండ్ పేకాడుకుందాం. నా స్టేక్ టెన్ట్వంటీ. తరువా నీ యిష్టం.

గీతా : ఏవండీ! రాత్రి మీరు తాగివచ్చారు కదూ.

ఆనంద్ : ఛీ ఛీ, యింకా నయం, బలేదానివే. అమ్మో
( నెత్తి మీద చేయవేయబోతాడు )

గీతా : ( చేతిని తీసివేస్తూ ) ఎందుకండీ బుకాయిస్తారు. మీరు చెప్పకపోతే తెలుసుకోలేనంత అమాయకురాలను కాను.

ఆనంద్ : నువ్వు అమాయకురాలివనుకునేతం అమాయకుడిని కాను – నేను. చదువుకున్న దానివి, పైగా ఉద్యోగం కూడా చేస్తున్నావాయె అధిగాక యీ మధ్య నీక్కాస్త తెలివితేటలు కూడా ఎక్కువవుతున్నాయిలే.

గీతా : అవునండీ. భగవంతుడు ఆడదానికి కష్టాలకు తగ్గట్లు తెలివి తేటలు కూడా పెంచుతాడేమో.

ఆనంద్ : కాదు కాదు. కష్టాలతోపాటు తెలివితేటలు పెంచుతాడు. తెలివి తేటలు పెంచి కష్టాలపాలు చేస్తాడు. ఈ పూటకు సూక్తి ముక్తావళి చాలుగాని ఏదీ పేక యిలా పట్టుకురా.

గీతా : ఏమండీ, మీరీ మధ్య ఎందుకిలా మారిపోతున్నారో ఎప్పుడైనా ఆలోచించారా ?

ఆనంద్ : అబ్బే లేదు. యివాళ ఆఫీసుకు శలవు పెట్టి ఆలోచించి సాయంత్రం తమకు కారణాలు విన్నవించుకొంటాను. గీతా, యీ నెలలో నీవు ఏమీ కొనడానికి వీలులేదు. నీ జీతం అంతా నాకే కావాలి.

గీతా : ఎంత సేపు నా ఉద్యోగం గురించి నే తెచ్చే జీతం గురించి ఆలోచనేగాని నా మనసులో సుళ్ళు తిరుగుతున్న వేదన అర్థం చేసుకోరేమిటండి.

ఆనంద్ : అబ్బబ్బా గీతా, యిప్పుడేమైందని పొద్దున్నే యీ పంచాయితీ నీకు వుద్యోగం లేని రోజులలలో మనం బ్రతుకులేదా ? పస్తులున్నామా ?

గీతా : ఆ రోజులలో పస్తుండాల్సి వచ్చినా పరమానందంగా వుండేది. కాని యిప్పుడు పరమాన్నం తింటున్నా ఏమిటో దిగులుగా వుంటోందండి.

ఆనంద్ : గీతా, గతాన్ని గుర్తుచేసి మూడ్ పాడుచెయకు, అయినా యిది సంపాదనల గురించి వ్యయాలను గురించి  ఆలోచించే సమయమూ ...ఎందుకిలా అనవసర విషయాలను గురించి  ఆలోచించి మనస్సు పాడుచేసుకొంటావెందుకు ? చెప్పు.

గీతా :  ఏవండీ మీకు గుర్తువుందా. అప్పటిలో ఆర్ధికమైన  చిక్కులున్నా ఎంతో హాయిగా వుండేవాళ్ళం . మీరు సరిగ్గా ఆరింటికల్లా యింటికొచ్చేసేవారు. మీరు ఎప్పుడొస్తారా అని పిచ్చిదానిలా ఎదురు చూస్తూ వుండేదాన్ని. కూరలు  తెచ్చుకోవడానికని ఇద్దరం షికారుగా బయటకు వెళ్ళేవాళ్ళం. నేను వంటపనిలో  వుంటే మీరు కబుర్లు  చెబతూ నవ్విస్తూ వుండేవారు.  వున్నంతలో హాయిగా తిని ఎంతో  ఆనందంగా  ఒకళ్ళ చేతుల్లో యింకొకళ్ళు కరిగిపోతూ... ఏవండీ  మీరు యీ మధ్య  అలా వస్తున్నారా ? మనం అంత సంతోషంగా వుండగలుగుతున్నామా ? ఎందుకని వుండలేకపోతున్నామో  కారణం ఏమిటో ఎప్పుడైనా  ఆలోచించారా ?

ఆనంద్ : గీతా, నువు  ఏవేవో  వూహించుకుని పదే పదే  నన్ను గురించి  ఆలోచిస్తూ ఎందకలా బాధపడిపోతావు...

గీతా : అవునండీ. ఆలోచనలను అంటిపెట్టుకొనే ఆవేదనలు ఉంటాయి.  మీ వ్యసనాల గురించి  ఆలోచిస్తున్నాను  గనుకనే నాకీ బాధ. వున్న అలవాట్లు చాలవన్నట్లు యిప్పుడు  తాగుడు కూడా. యీ విధంగా అయితే దీనికి  అంతం ఎక్కడ ? పర్యవసానం ఏమిటో  ఎలా వుంటుందో ఒక్కసారన్నా  ఆలోచించారా ?

ఆనంద్ : గీతా, నిర్మలమైన ఆకాశంలో సూర్యోదయం చూచి ముచ్చటపడి మురిసిపోయే కళాపిపాసి  ఒకడుంటే ఆకాశం తగలబడి పోతోందని గుండెలు బాదుకుని  గోలపెట్టే వెర్రివెధవ మరొకడుంటాడు.  అంచేత అది చూసేవాళ్ళను బట్టి వాళ్ళ సంస్కారాన్ని బట్టి వుంటుంది. యీ అలవాట్లు అనేవి కూడా అలాంటివే.

గీతా : అంటే రేసులు,  పేకాడటం, తాగి తందనాలాడటం వ్యసనాలు కావంటారు అంతేనా ?

ఆనంద్ : అవును. అవి వ్యసనాలు ఎంత మాత్రం కావు. పరిస్థితులు ప్రభావాలు కావచ్చు. నాగరికతా చిహ్నాలు కావచ్చు.

గీతా : అలా అనిచెప్పి ఎందుకు మీకు మీరే మోసం చేసుకోజూస్తారు ?

ఆనంద్ : గీతా ! నేను ఏమి చేస్తున్నానో నాకు బాగా తెల్సు. నీ సలహాలు, సానుభూతులు నాకు అవసరం లేదు. అయినా నీ బాధకు కారణం నేను సుఖంగా వుండటం అంతేనా ?

గీతా : ఏవండీ?

ఆనంద్ : కాక మరోలా ఏమనకోమంటావు. నిజమే. ఇప్పటికి అప్పటికీ పోల్చుకుంటే నాలో మార్పు వచ్చే వుంటుంది. మార్పు అనేది మనిషికి సహజం గీతా ! ఆ రోజుల్లో మనకు ఆర్థికమైన యిబ్బందులుండేవి. చాలీ చాలని జీతంతో ఆశలని, కోర్కెలని ఎక్కడికక్కడ త్రుంచివేసుకొంటూ బ్రతికాం. కానీ యిప్పటి పరిస్థితి వేరు. మన చీకటి బ్రతుకుల్లో వెలుగరేఖలా వచ్చింది నీ ఉద్యోగం. యిద్దరి సంపాదనల్లతో పరిస్థితుల ఎంతో మారాయి. విలువగల వస్తువులు ఎన్నో కొనుక్కొన్నాము. అటువంటప్పుడు యింకా నికృష్టంగా ఎందుకుండాలి. మారుతున్న ప్రపంచంతో మారి కాస్త నాగరికంగా సోషల్‌గా వుంటే తప్పా ? ఈ చిన్న విషయానికి ఎందుకింత రాద్ధాంతం చేస్తావు.

గీతా : నాగరీకంగా మొదలైనవి అనాగరీకంగా తయారయ్యి మనిషిని ఆసుపత్రిపాలు, పరువును బజారుపాలు చేస్తాయండీ. నా బాధను అర్థం చేసుకొని మళ్ళీ తాగనని మాటివ్వండి.

ఆనంద్ : సంస్కారం అనేది స్వతహాగా లేకపోయినా సంపర్కం వల్ల వస్తుందని ఎవడో అన్నాడట కాని ఆ మాట తప్పేమో అనిపిస్తుంది నిన్ను చూస్తుంటే.

గీతా : అవునండీ. మాటని దాటేస్తారేగాని మాటమాత్రం యివ్వరు. మీ అలవాట్లని మార్చుకోరు మీ వ్యసనాలకోసం వూరంతా అప్పులు చేయండి. తీర్చడానికి మాత్రం ఈ సంస్కారం లేని భార్య, దాని జీతం రాళ్ళు కావాలి. ఇదంతా నా ఖర్మ అండీ, ఖర్మ.

( కళ్ళ నీళ్ళు పెట్టుకొంటూ లోనికి వెళ్ళుతుంది )

ఆనంద్ : నీ ఖర్మ కాదు. నా ఖర్మ. తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందని నేనొకందుకు శలవు పెడుదామనుకుంటే యివ్వాళ పరిస్థితి అంతా యిక్కడ రివర్సులో

నడుస్తోంది.

( అని కుర్చీలో కూర్చొని వీక్లీ తిరగేస్తుండగా  కోదండరమాయ్య  ప్రవేశిస్తాడు )

కోదండం : అమ్మాయి గీతా ఆ పేపరు  కాస్త యిటు తగలేయమ్మ, అదేమిటో  పేపరు చూడకుండా  బయటికెళ్ళితే బట్టలు లేకుండా  బయటికెళ్ళినంత లోటుగా వుంటుంది. ( ఆనంద్‌రావును చూచి  ) అదేమిటోయ్  అప్పుడే లేచావు. అమ్మాయి ఆఫీసుకు వెళ్ళితేనే  గాని తెల్లవారదుగా !

ఆనంద్ : పొద్దున్నే  తిట్లు తినాలని  మొహాన  రాసి వున్నది. అంచేత తట్టి లేపింది.

కోదండం : ఎవరూ, అమ్మాయా ?

ఆనంద్ : అబ్బే కాదు. మహామ్మారని  మా నెత్తినుంటుంది లేండి – ఆవిడ.  అద్సరే. తమరేమిటి యిలా దయచేశారు ? కోర్టులు, కేసుల....

కోదండం : వున్నాయ్, కోర్టులు కేసులు అన్నీవున్నాయి. చూడబ్బాయ్. సూర్యుడిలో వేడి, చంద్రుడిలో చల్లదనం  తగ్గిపోవచ్చు. కాని  కోర్టుల్లో కేసులు మాత్రం  తగ్గవు. అసలు కోర్టుల్లో ఇన్ని కేసులుండటానికి కారణం,  దాని వెనుకనున్న రహస్యం  తెలుసా ?

ఆనంద్ : చంపేశారు. నాకెలా తెలుస్తుంది. నేను ఎప్పుడూ  కనీసం కోర్టు ఆవరణలో కూడా అడుగెట్టలేదు.

కోదండం :  నేను చెబుతా విను. వెరీ సింపుల్, మనిషికి మనిషికీ మధ్య సామరస్యభావం లేకపోవడం వల్ల. ఉదాహరణకి  నీకూ, నీ భార్యకు ఏదైనా గొడవచ్చిందనుకో.

ఆనంద్ : ఆ.....

కోదండం : అహా...మాటవరసకు అంటున్నా...నాలాంటి ప్లీడరు గుమాస్తాను పిలిచి పరిష్కారం  చేసుకోవాలేగాని కోర్టుకని  పరిగెత్తుకెళతారా...కూడదు...ఇహ చెప్పు....

ఆనంద్ : పొద్దున్నే ఏదో మాటా మాటా అనుకున్నాము.  అప్పుడే మీదాకా వచ్చిందన్నమాట.  మా సంసారం  బొత్తిగా ఎ.సర్టిఫికేట్ సినిమాల పబ్లిక్ షో అయిపోయిందనుకోండి.

కోదండం : చూడబ్బాయి, నేను మాటవరసకన్నాను. ఏమిటి, మరోలా అనుకోకు, అవునూ ఏదో పనిమీద వచ్చాను. అసలు విషయం వదిలేసి అనవసరంగా మాట్లాడేస్తున్నాను. అసలు ఏం పని మీద వచ్చానో నీకుగాని చెప్పానా ?

ఆనంద్ : అబ్బే లేదే. అలా వచ్చారు. యిలా నిలబెట్టి వాయించేస్తున్నారు. అయినా వూరికే చూచిపోదామని వచ్చుంటారు. వేళవుతోంది వెళ్ళిరండి.

కోదండం : కాదు కాదు. నేనెప్పుడూ వూరికే రాను. ఖచ్చితంగా ఏదో పని మీదే వచ్చివుంటానయ్యా ! కాని ఏమిటా అని.

ఆనంద్ : యికనుంచి ఒక పనిచేయండి. ఏదైనా పనిమీద బయలుదేరినపుడు ఆ పని పేపరు మీద వ్రాసి జేబులో పెట్టుకొని రాండి.

కోదండం : అద్గది. పేపరు హెడ్‌లైను చూచిపోదామని వచ్చాను.

ఆనంద్ : చంపేశారు. పేరు చూడాలనివొచ్చారా. ఆ భాగ్యం యింకా నాకే కలుగలేదు. ఇంక మీరేం చూస్తారు ?

కోదండం : అంటే యీ రోజు పేపరు యింకా రాలేదా ?

ఆనంద్ : యీ రోజే కాదు, ఏ రోజైనా నేరుగా మనయింటికి రాదు. మధ్యలో పేపరుకి భవిష్యత్తుకి లంకిపెట్టుకున్న ఒక జీవి వున్నది. ఆ జీవి చూశాకే మీ యింటిలోకి వస్తుంది.

కోదండం : ఎవరోయ్. నాకు తెలియని ఆ జీవి.

ఆనంద్ : అబ్బే మీకు తెల్సినవాడే. అవతల గొడ్లకోసం కట్టిన షెడ్డుకి తలుపు పెట్టి, దానికి గది అని పేరు కూడా పెట్టి ,నెల ఒక్కింటి వందరూపాయిలు చొప్పున అద్దెకు యివ్వగా అందులో కట్టేసినట్లుగా పడివున్న నిరుద్యోగి...మూర్తి.

కోదండం : ఓహో.... మూర్తా, ఏదీ మన మూర్తే...ఆగాగు. గొడ్లకోసం కట్టిన షెడ్డు – వందరూపాయలు అద్దె ...దానికి గది అని పేరు పెట్టడం. నవ్వి భలేవాడివయ్యా. ఆ మాట చెప్పడానికి యింత డొంకతిరుగుడా. అయినా వచ్చిందగ్గిర నుంచి చూస్తున్నాను నీ వరస, ఎవరిమీద నీ కారాలు, మిరియాలు.

ఆనంద్ : ఎవరిమీద చూపిస్తే ఎవరూరుకొంటారు చెప్పండి. కట్టుకున్న పెళ్ళామయినా కదిపితే కస్సుమని మీదపడుతుంది. రోజులు రోజుల్లాగా వున్నాయిటండీ. ఏమనుకొని ఏం లాభం. ఏమిటో మీకు వేళవుతుందో ఏమో.

కోదండం : వేళదేవుందోయ్. వెధవది. మాటా మంచీ వుండాలిగానీ. మా రోజుల్లో 10 గంటలు కొట్టేసరికి కోర్టులో జడ్జీతో సహా అందరూ హాజరై వుండేవారు. కాని యిప్పుడు ప్చ్ ! నువ్వన్నట్లుగా రోజులు రోజులుగాల లేవోయ్. అదే నా బాధ.

ఆనంద్ : పోన్లెండి, పొద్దున్నే బాధపడేవారికి గుండెనొప్పివచ్చే అవకాశాలు ఎక్కువగా వున్నాయని ఎక్కడో చదివాను.

కోదండం : అలాగా చెప్పావుకాదేం. నేనేం బాధపడటంలేదు. ఏదో మాటవరసకు అన్నానంతే. ఏమిటోనయ్యా మీ ఇంటిలోకి వస్తే వెళ్ళబుద్దవదు. ఎందువల్లనో తెలుసునా ! మాయావిడ పోయేవరకు నేను యీ పోర్షనులోనే వుండేవాడిని. అది పోయింది. నా కొక్కడి కింత కొంపెందుకుని నేను ఈ రూమ్‌లోకి మారి ఇది మీకు అద్దెకిచ్చాను. ఏమిటోనోయ్. ఇక్కడికొచ్చి కాసేపు కూర్చుంటే మాయావిడ్ని చూచినట్లే వుంటుంది.

ఆనంద్ : ఇక్కడకు వచ్చి కాసేపు కూర్చుంటే మీ యావిడ్ని చూచినట్లే వుండటమేమిటండి ?

కోదండం : అదే లేవోయ్. మేము సంసారం చేసిన గత స్మృతులు నెమరువేసుకొంటూ వుంటాను.

ఆనంద్ : నాకు చిన్న అనుమానం. యీ ఇంటిలో వున్నంతకాలం మీ దంపతులు ఇద్దరూ దెబ్బలాడుకొనేవారా ? ....లేక....

కోదండం : ( నవ్వుతూ ) ఓ అదా నీ అనుమానం. దెబ్బలాటంటే కొట్టుకునే వాళ్ళం కాదుకాని తరచూ మాటపట్టింపులొచ్చేది. అప్పట్లో నాకు కోపం గూడా జాస్తీగా వుండేది. ఇప్పుడు పూర్తిగా పోయిందనుకో ఏదో చిన్న విషయం మీద మాటా మాటా పెరిగేది. నేను అలిగి ఇంటిలోంచి వెళ్ళిపోతుండేవాడ్ని. మళ్ళీ నేను వచ్చేవరకు అలాగే గడపలో కూర్చొనివుండేది. ఒక్కోసారి అన్నం తినకుండా అలుగుతూండేవాడిని. కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమాలేది.. చివరకు తనూ పస్తుండేది.

ఆనంద్ : అదుగో మళ్ళీ బాధపడుతున్నారు.

కోదండం : అబ్బే అదేం లేదులేవోయ్. ఆలోచించుకొంటే యిప్పుడనిపిస్తుంది ఎంత పశువులా ప్రవర్తించానా అని.

ఆనంద్ : అసలు విషయం శెలవిచ్చారు. అంటే ఏదో యీ ఇంటిలోనే గొడవుందన్నమాట.

కోదండం : అబ్బే అదేం లేదోయ్ నీ పిచ్చిగాని. అవి మనుష్యులను బట్టి వుంటుందిగాని ఇళ్ళల్లో ఏం వుంటుంది ? అయినా మీరిద్దరూ చిలకా గోరింకలులాగా హాయిగా వుండటం లేదూ ?

ఆనంద్ : అవునవును. చాలా హాయిగా వుంటున్నాము. కాని మీరన్నట్లు చిలకా గోరింకలులాగా కాదు. పులి మేకలు, పిల్లి ఎలుకలూ వగైరా వగైరాల్లా .....

కోదండం : భలేవాడివోయ్. పాచినోటితో పరిహాసాలాడగూడదని వెనకటి ఒక జడ్జిగారంటూ వుండేవారు. నువ్వు నాకన్నా చిన్నవాడివి. అంచేత అడక్కపోయినా చెబుతున్నాను. ఆడదాన్ని వుసురు పెట్టిన మగాడు పైకిరాడు –

( గీత కాఫీ గ్లాసుతో వచ్చి )

గీతా : అలా చెప్పండి బాబాయ్ గారు.

కోదండం : ఇది పచ్చి నిజం.

ఆనంద్ : ఆ మాట ఆడవాళ్ళకు కూడా వర్తిస్తుంది. అంటే మొగుడనే వాడిని పోట్లాడి, రాచి రంపాన పెడితే, కొంప గుల్ల, నెత్తిన కొంగు వస్తాయి.

గీతా : ( కాఫీ గ్లాసు యిస్తూ ) బాబాయ్‌గారు కాస్త కాఫీ తీసుకోండి.

కోదండం : మా తల్లే. మా తల్లే. ఎంతైనా ఆడవాళ్ళు ఆడవాల్లేనోయ్. అతిథి సత్కారం వగైరా వాళ్ళకు తెలిసినట్లుగా యీ మగవెధవలకు ఏం తెలుస్తాయి ( గీతను చూస్తూ ) అదేమిటమ్మా కళ్ళంత ఎఱ్ఱగా వున్నాయి. రాత్రి నిద్రపట్టలేదా ?

గీత : ( తడబడుతూ ) అబ్బే అదేం కాదండి. పొగకి కాస్త ఎఱ్ఱ బారినాయి అంతే.

ఆనంద్ : మా ఇంట్లో రోజుకు ఒకసారన్నా పొగలేస్తుంటుంది లేండి. అంచేత ఆవిడ కళ్ళు ఎరుపు, నా మనస్సు మసి బారుతూ వుంటాయి.

కోదండం : పొగేమిటమ్మా గ్యాసుమీదేగా వంట.

గీతా : కొంతమంది మొగుళ్ళకి భార్యలను సూటీ పోటీ మాటలనడం హాబీ. ఆయన మాటలేమీ పట్టించుకోకండి బాబాయ్‌గారూ.

ఆనంద్ : భర్త కాఫీ అడిగితే కలుపుకు త్రాగు, వెచ్చబెట్టుకు తాగు, యిలా వచ్చి తీసుకెళ్ళు, అలా వచ్చి తీసుకెళ్ళు అనే ఆడవాళ్ళు బయట వాళ్ళకు మాత్రం అడక్కుండానే చక్కటి కాఫీ తెచ్చిస్తారు. వాట్ ఎ. ఫెంటాస్టిక్ నాన్‌సెన్స్.

కోదండం : అరే, అదేమిటమ్మా, అబ్బాయికి కాఫీ ఇవ్వకుండా నాకు యిచ్చావా ? తప్పు కదూ( కాఫీ గ్లాసు ఇవ్వబోతాడు ) తీసుకోవోయ్ !

ఆనంద్ : ( వద్దని సైగచేస్తూ ) అబ్బే మనింట్లో సంగతి కాదులేండి. మా ఫ్రెండు పెళ్ళాం మాట చెబుతున్నా.

కోదండం : అదా సంగతి. అదిరిపోయాననుకో.అయినా మీ ఫ్రెండు పెళ్ళానికి రవ్వంత పిచ్చేమన్నా వుందా ? కాకపోతే భర్తను ఉపోషం వుంచి బయటవాళ్ళకు ఫంక్తి భోజనాలేమిటోయ్.

ఆనంద్ : అదే విచిత్రం. పాపం మా ఫ్రెండు గాడిని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుందనుకోండి. ఆవిడగారిని ఏమనడానికి వీలు లేదు. ఎందువల్లనంటే ఆవిడగారు కూడా ఉద్యోగం వెలిగిస్తోంది లేండి. పొరపాటున ఏమైనా అన్నాడా ఇక మొదలెటుడుతుంది. “ నువ్వెంత, నీ ఉద్యోగమెంత ” అంటూ, పాపం, అమాయకుడ్ని చేసి ఆడిస్తుందనుకోండి.

కోదండం : అయ్యో పాపం.

గీతా : బాబాయ్‌గారు. భార్య సంపాదిస్తోంది గదా అని మొగుడు యిష్టం వచ్చినట్లుగా పేకాడి, త్రాగుడుకు అలవాటుపడి, యిల్లు వళ్ళు గుల్ల చేసుకోవడం భావ్యంగా వుంటుందా ? తన అలవాట్లకోసం అవసరాలకోసం వూరంతా అప్పులుచేసి వాటిని భార్యను తీర్చమనడం, కాదంటే నానా విధాలుగా హింసించడం న్యాయమేనా ? చెప్పండి ?

కోదండం : అదేవిటోయ్ నీ ఫ్రెండు అంత ఘనుడా ? మరి అమాయకుడు మంచివాడన్నావు.

ఆనంద్ : ఆవిడ చెప్పేది నా ఫ్రెండు గురించి కాదులెండి . బహుశా ఆవిడ గారి ఫ్రెండు అయివుంటాడు.

కోదండం : ఆవిడగారి ఫ్రెండా...

గీతా : అదేనండి నా ఫ్రెండు మొగుడు. మీ ఉద్దేశ్యం చెప్పండి.

కోదండం : అమ్మాయ్. కమ్మని కాఫీ చేతికి ఇచ్చి కఠినమైన సమస్యనే ముందుంచావు. ఇది అతి సున్నితమైన విషయం. కాని నీ మాటలను బట్టి చూస్తుంటే నీ ఫ్రెండు మొగుడిదే తప్పులా అనిపిస్తుంది. భార్య సంపాదిస్తోంది కదా అని మగాడు విచ్చలవిడిగా తిరగడం చాలా తప్పు. ఆమె సంపాదనను ఆధారం చేసుకొని తన సంసారం పైకి తెచ్చుకోవాలేగాని తప్పు దారిలోపడి జీవితం నాశనం చేసుకోకూడదు, ఆమెకు నా సానుభూతిని అందజేయామ్మ

( ఖాళీ గ్లాసును ఆమెకు అందిస్తాడు )

ఆనంద్ : ఓహో అంటే కేవలం ఉద్యోగం చేస్తున్నానన్న మిడిసిపాటుతో మొగుడనేవాడ్ని లక్షపెట్టక వాడికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోగా " ఇన్నిగంటలకల్లా ఇంటికి రావాలి " అన్ని గంటలకే బయటకు వెళ్ళాలి, నాకు చెప్పకుండా ఏ పని చేయకూడదు.... "

కోదండం : ఏమిటేమిటి ?

ఆనంద్ : ఆగండి. పూర్తిగా చెప్పనివ్వండి. ఇలాంటి నియమనిబంధనలను విధించి వాడిని బానిసలా చేసుకోవాలనే ప్రయత్నం సమర్ధనీయమా ? వచ్చిన అవకాశాన్ని ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకోవడం తెలియక మగాళ్ళపై పడి ఏడ్చే ఆడవాళ్ళు ముందుకు పోతున్నామని భ్రమపడుతున్నారుగాని వెనక్కి పోతున్నామని తెలుసుకోలేకపోతున్నారు, యీ విషయంలో నా ఫ్రెండుదే కరెక్టు. వాడిదేమీ తప్పులేదు.

కోదండం : ఏమిటోయ్. కొంపతీసి నీ ఫ్రెండు పెళ్ళానికి, ఆవిడ ఫ్రెండు మొగుడికి ఏమయినా సంబంధం వున్నదా ?

ఆనంద్ : కరెక్టు. బాగా కనిపెట్టారు. నా ఫ్రెండు పెళ్ళాము, ఆవిడ ఫ్రెండు మొగుడు సాక్ష్యాత్తు భార్యాభర్తలు.

కోదండం : అదన్నమాట సంగతి. ఇప్పటికి కేసు పూర్తిగా అర్ధమయింది. అంటే ఆ

మొగుడూ పెళ్ళాల గొడవల్లో యీ భార్యాభర్తలు చెరొక పక్షం వహించి వాదించుకొని ఒక నిర్ణయానికి రాలేక నన్ను న్యాయం చెప్పమంటున్నారు. మీరు సరైన మనిషి దగ్గరకి వచ్చారు. న్యాయం చెప్పడం నాకు కొట్టినపిండి.

ఆనంద్ : అయ్యా కొట్టినపపండి, వండిన అరిసెలు అని నాన్చక న్యాయాన్ని చెప్పి మన జాతి నిండు గౌరవాన్ని నిలపండి.

గీతా : చెప్పండి బాబాయ్‌గారు. భార్యాభర్తలని, ఆడా మగ అని వ్యత్యాసం చూపకుండా యిద్దరు వ్యక్తులుగా యీ సంఘంలో సభ్యులుగా సమంగా ఆలోచించీ మరీ చెప్పండి.

కోదండం : చూడమ్మాయి. ఆవేశమే అన్ని అనర్ధాలకు కారణమని వాడెవడో అన్నాడు. అదీకాక ఆ దంపతులిద్దరు లేకుండా వారి పరోక్షములో న్యాయనిర్ణయం జరిగినా ఏమిటి లాభం. తప్పు చేసినవారికి తాము చేసినది తప్పు అని తెలియాలి కదా. వారు సక్రమంగా వుంటామని హామీ ఇవ్వాలి గదా.

ఆనంద్ : మొత్తానికి మీ ప్లీడరు గుమాస్తా బుద్ధి పోనిచ్చుకున్నారు గాదు. ఏదీ సూటిగా చెప్పరేమండి ?

కోదండం : ఎంత న్యాయమైనా సూటిగా చెప్పకూడదని వెనకటికో జడ్జిగారు అంటూ వుండేవారు. చూడబ్బాయ్. మీరుభయులకి మీ మీ స్నేహితుల జీవితాలు బాగుచేయాలని తద్వారా వాళ్ళ కాపురం నిలబెట్టాలనే కోర్కె నిజంగా మీకుంటే, వాళ్ళిద్దరినీ ఒక్కసారి నా దగ్గరికి పిలిపించండి. వాళ్ళముందే నా నిర్ణయం కుండబద్దలుకొట్టినట్లు చెప్పేస్తాను.

మూర్తి : న్యూస్ పేపరుతో ప్రవేశిస్తాడు ) ( కోదండరామయ్యతో ) మీ గురించి ఎవరో వచ్చారు. మీ గదిలో కూర్చోబెట్టాను.

కోదండం : మనింటిముందు వాలిందంటే అది ఖచ్చితంగా కోర్టు పక్షి అయివుంటుంది. అయినా చూసొస్తాను. మళ్ళీ వస్తానోయ్ ఆనందరావు వస్తానమ్మా.... ( అంటూ వెళ్ళిపోతాడు )

( మూర్తి రెండు అడుగులు ముందుకు వేసి )

మూర్తి : ఇదిగోనండి పేపరు.

ఆనంద్ : ఆ పేపరు బిల్లుకట్టేది అవిడకాదు, నేను, అయినా నా కర్ధంకాక అడుగుతాను

రోజూ పేపరు రాగానే ముందే అందుకొని క్షుణ్ణంగా చదివితేనే గానీ యివ్వవు. ఏమిటీ నీ ఉద్దేశ్యం. పేపరు మేము చూడమనా ? లేక పేపరు చూసే తీరిక వీళ్ళకెక్కడిదిలే అనా ?

మూర్తి : క్షమించండి. వాంటెడ్ కాలం చూసిద్దామనే యాంగ్జయిటీతో ....

ఆనంద్ : నువ్వు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు వాంటెడ్ కాలం చూసిస్తానంటే ఎలాగయా ! యిదిగో చూడు, ప్రొద్దున్నే పేపరు – వయస్సులో వున్న ఆడపిల్లలాంటిది. మాంచి పవరుంటుంది. రాత్రిపూట పేపరు పాతికేళ్ళుగా కాపురం చేస్తున్న పెళ్ళాం లాంటిది. అసలు ఆ వైపే చూడబుద్దికాదు.

మూర్తి : ఉద్యోగం సంపాయించుకోవాలన్న తాపత్రయంలో యీ విషయాన్ని గమనించలేదు. క్షమించండి. రేపటి నుండి మీ పేపరు ముట్టుకోను. లైబ్రరీలో చూచుకొంటాను.

ఆనంద్ : అది నీ ఒంటికి మా యింటికి కూడా మంచిది.

గీత : అవేం మాటలండి మూర్తి ఆయనగారేదో చికాకులో వున్నారు. ఆయన మాటలేవీ పట్టించుకోకు.

మూర్తి : నా భాధ, వ్యద మీకేం తెలుస్తాయి. మీరదృష్టవంతులు, మీరిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వడ్డించిన విస్తళ్ళలాంటి జీవితాలు గడుపుతున్న మీకు మా పరిస్థితులు అర్ధంకావు. అది సహజం.

ఆనంద్ : నీ కెలాగూ ఉద్యోగం రాదు కాని ? ఒక పనిచేయి. వుద్యోగం చేస్తున్న అమ్మాయిని చూచి పెళ్ళిచేసుకో. ఫుడ్ ప్రాబ్లం తీరిపోతుంది.

గీత : దయచేసి మూర్తిని ఏమీ అనకండి. అతడెంతో బాధలో వుంటేనేగాని అలా మాట్లాడడు.

మూర్తి : అన్నివ్వండి. ఏమీ ఫరవాలేదు. అనడానికి కొంతమంది పుడితే, పడటానికి కొంతమంది పుడతారు.

ఆనంద్ : బాగుంది, చాలా బాగుంది. అతను బాధపడటం, నీవు ఓదార్చడం చాలా గొప్పగా వుంది. ( గీతతో ) స్నానానికి వేడినీళ్ళున్నాయా, పంపునీళ్ళే గతా ?

గీతా : అన్నీ వున్నాయి. లోపలకు వెళ్ళి చూస్తే అన్నీ కనపడుతాయి.

( గీతవైపు గుర్రుగా చూస్తూ ఆనందరావు లోనికి వెళ్ళిపోతాడు. అతడు వెళ్ళినవైపు రెండు క్షణాలు చూసి మూర్తితో ) మూర్తీ రాత్రి అన్నం తిన్నావా ?

మూర్తి : మనిషి తిండి లేక చావడు. అయ్యో నేను ఎందుకూ పనికిరానివాడనయ్యానే అన్న భావనా బాధలతో చస్తాడు.

గీతా : అలా అని నిన్ను నీవే ఎందుకు శిక్షించుకొంటావు ? వుద్యోగం యీ రోజు కాకపోతే రేపు వస్తుంది.అయినా దేశంలో ఎంతమంది నిరుద్యోగులు లేరు ? అందరూ నీలాగే దిగులుపడుతున్నారా కష్టం, సుఖం, చీకటి, వెలుగు అన్నారు.

మూర్తి : అలా అనుకొనే యిన్నాళ్ళు బ్రతికాను. కాని నా జీవితంలో సుఖం, వెలుగు అన్నవి లేవు. నిస్సహాయతతో కూడిన యీ చేతకాని బ్రతుకు బ్రతకడం నా వల్ల కాదు.

గీతా : మూర్తి ఏమిటి, యివాళ అంతగా భాదపడుతున్నావు ? ఇంటి నుంచి మళ్ళీ ఉత్తరం గాని వచ్చిందా ?

మూర్తి : అవును వచ్చింది. మా అమ్మ వ్రాసింది. ఏదో ఒక ఉద్యోగంలో చేరి వైద్యం చేయించకపోతే నాన్న మనకు దక్కడంటూ ఆవేదనంతా అక్షరాల్లో వ్రాసింది.

గీతా : మూర్తీ....

మూర్తి : నన్నెంతో ప్రేమగా చూచుకొనే మా నాన్న చావు బ్రతుకుల్లో వుండి, బాబూ శిదిలమైపోతున్న యీ శరీరానికి కాస్త రిపేరు చేయించమని అర్థిస్తుంటే " నాన్నా నాకు యింకా వుద్యోగం రాలేదు. వచ్చేదాకా ప్రాణాలు నిలబెట్టుకో లేదంటే నీ దారి నీవు చూచుకోమని చెప్పాల్సివచ్చిన నికృష్టపు బ్రతుకు నాది.

గీతా : ధైర్యంగా వుండు. నీకు నేనున్నానని మర్చిపోకు.

మూర్తి : లేదు. మర్చిపోలేదు అమ్మా, నాన్న, తమ్ముడు , చెల్లితో పాటు రక్తం పంచుకోకపోయినా కష్ట సుఖాలను పంచుకొంటున్న మీరు అందరూ వున్నారు. ఆప్యాయతలను కురిపిస్తున్నారు. అదే నా బాధ.

గీతా : మూర్తీ ....?

మూర్తి : మా అమ్మ యెముకల్ని గంధం తీసి, ఆ గంధాన్ని నా పెన్నులో యింకులా పోసి పరీక్షలు వ్రాశాను. చివరి పరీక్షవ్రాసి యింటికొచ్చి అమ్మా పరీక్షలన్నీ బాగా వ్రాశాను. యిదంతా నీ చలవేనమ్మా, నాకుద్యోగం రాగానే మొట్టమొదటి జీతంతో

నీకు పట్టుచీర  కొనిపెడుతానని  ప్రఘల్భాలు పలికాను. అటువంటి తల్లి యీనాడు నోరు తెరిచి “ బాబూ  నాకు పట్టుచీరవద్దు, నాన్నకు  వైద్యం చేయించి నా పసుపు కుంకుమ నిలబెట్టమని ” దీనంగా  అర్ధిస్తుంటే  ఏమీ చేయలేని అసమర్ధుడనయ్యాను.

గీతా : మూర్తీ ...?

మూర్తీ : “ అన్నయ్యా స్కూలుకి చిరుగులున్న లంగా జాకెట్టుతో వెడుతుంటే,  నీ కన్నేళ్ళని హేళనగా ప్రశ్నిస్తున్నారు. ఒక పావడా కొనిపెట్టవా ” అని అడిగితే  “ నాకుద్యోగం రాకముందే  ఎందుకెదిగావ్ నీకామాత్రం బుద్దిలేదూ ” అని చెల్లెల్ని  మందలించిన అన్నయ్యను నేను.

గీతా : మూర్తీ...ఏమిటీ యివాళ విడ్డూరంగా మాట్లాడుతున్నావు ?

మూర్తీ : ( ఆవేశంగా ) భగవంతుడా నన్నెందుకిలా పుట్టించావు ? మనస్సు  మమత అన్నీ యిచ్చి చేతగాని వాణ్ణి చేసి  యీ జీవితరంగంపై నిలబెట్టావు. ఏమిటి నీ వుద్దేశ్యం ? ఈ శిక్ష  నేచేసిన తప్పుకా, చేయని తప్పుకా ? లేక  నాచేత తప్పు చేయించాలనా ?

గీతా : మూర్తి.... నా మాట వినిపించుకోవా ? మీ నాన్న వైద్యం గురించేగా నీవు బాధపడేది.డబ్బు నేనిస్తాను. నాన్నకు వైద్యం  చేయించు.

మూర్తి : వద్దండీ వద్దు. ఎన్నో సార్లు పీటవేసి అన్నం పెట్టారు. రూముకు అద్దెకట్టలేని పరిస్థితుల్లో నేనిచ్చినట్లుగా మీరు అద్దె డబ్బులిచ్చారు. యింకా మీవద్ద డబ్బు తీసుకొని  యిప్పటికే  మండుతున్న మనస్సులో  మరింత ఆజ్యం పోయలేను. క్షమించండి..

గీతా : అంతేలే. పరాయివాళ్ళ నీడచూచి నా తోడని భ్రమపడటం నా పొరపాటు. ఎన్నిసార్లయినా  నే పిల్చి అడిగి అన్నం పెట్టాలేగాని ఏనాడైనా ఆప్యాయంగా  వచ్చి ఆకలేస్తోంది అన్నం పెట్టు అని అడిగావా ?

మూర్తి : ఏవండీ, నా వుద్దేశ్యం ....

గీతా : నా వుద్ధేశాలతో నా కనవసరం. నిజంగా నా మీద నీకభిమానం వుంటే డబ్బు తీసుకొని  వైద్యం చేయించి నాన్నను బ్రతికించు. కావాలంటే నీకుద్యోగం వచ్చాక నీ వద్దనుంచి మళ్ళీ అడిగి పుచ్చుకుంటాను.

మూర్తి : భగవంతుడు మనిద్దరిని చాలా విచిత్రంగా కలిపాడు. సహాయం  వద్దంటే మీరు

బాధపడుతారు. అలాగని పుచ్చుకొంటే తిరిగి నేనేం చేయలేకపోతున్నానని నేను బాధపడుతాను. మనిద్దరం బాధని బంతిలా చేసుకొని మానవత్వపు ఆట ఆడుకుంటున్నట్లుగా వుంది. కాని యిక బంతిని మీ వైపు రానివ్వను. యీ ఆట ముగిస్తాను. ( గుర్తువచ్చి )...ఆ మర్చిపోయాను.

గీతా : ఏమిటి మూర్తీ....?

మూర్తీ : యిందాకా మీరిచ్చిన చిల్లర డబ్బులతో మీకెంతో యిష్టమని మల్లెపూలు కొన్నాను. ( జేబూలోంచి తీసి ) తీసుకోండి. ( గీత మల్లెపూలు పెట్టుకొంటూ వుంటుంది ) మీరు సాధారణ స్త్రీ కాద. దేవతలు ( చేతులు పుచ్చుకుంటాడు )

ఆనంద్ : ( చప్పట్లు కొడుతూ ప్రవేశించి ) శభాష్ బాగుంది. చాలా బాగుంది అనుబంధం. సహాయాన్ని కాదంటే యీవిడ బాధపడుతుందట. అవునంటే అతను బాధపడ్తాడట. అంచేత ఆవిడ తృప్తికోసం ఆ బాధని తనే అనుభవిస్తాడు. అంచేత ఆత్మవంచనలకు గొప్ప పరాకాష్టం.( గీతవైపు తిరిగి ) ఎన్నాళ్ళనుచి నడుపుతున్నావీ నాటకనాన్ని !యింతవరకు వాడికి యీ విధంగా ఎంత దోచి పెట్టావు ? అందుకనా నే దగ్గరకు పిలిచినప్పుడల్లా మనస్సు బాగోలేదు, ఒంట్లో బాగోలేదని సాకులు చెప్పి తప్పించుకొంటున్నావు ?

గీతా : మీరు ఎలాంటి స్థితిలో వుండగా నేను మీ దగ్గరకు రావడంలేదో వూహించారా ? గుండెమీద చేయివేసుకొని చెప్పండి.

ఆనంద్ : ఆలస్యంగా వూహించాను. రోజులతోపాటు మోజులు కూడా మారుతుంటాయని గుండెమీద చేయివేసుకొని మరీ చెబుతాను.

గీతా : ఏమండీ ఏమిటి మీరు అంటున్నది.

ఆనంద్ : అంటున్నదేవిటో కూడాఅర్ధం చేసుకోలేని మైకంలో వున్నారన్న మాట.

మూర్తి : మీరు మాట్లాడేది నాకు బొత్తిగా అర్ధంకావడంలేదు. అంతా అయోమయంగా వుంది.

ఆనంద్ : వుంటుంది. అలానే వుంటుంది. ఆడుతున్న నాటకం రసాభాస అయ్యి వీధికెక్కినప్పుడు అలాగే వుంటుంది. నీ మీద నాకు మొదటినుంచి అనుమానంగానే వున్నది. నంగి నంగి కబుర్లు చెబుతూ, నట్టింట్లోంచి పడగ్గదివరకు వచ్చావన్నమాట.

గీతా : మీరేమి మాట్లాడుతున్నారో తెలుస్తుందా ! లేక రాత్రి పీకల దాకా తాగింది యింకా దిగలేదా. మూర్తి నాకు తమ్ముడు లాంటివాడు.

ఆనంద్ : అవునే మూర్తి నీకు తమ్ముడు. నీవు అక్కయ్యవు. యియిటవుంటి బ్రదర్స్ అండ్ సిస్టర్సుని చాలా మందిని చూచాను. నీ కల్లబొల్లి మాటలతో నా కళ్ళు కప్పాలని ప్రయత్నించకు.

గీతా : ( ఏడుస్తూ ) ఏవండీ నా కళ్ళల్లోకి సూటిగా చూచి చెప్పండి. నన్ను, నన్నే అనుమానిస్తున్నారా ?

ఆనంద్ : అనుమానించకపోవడానికి నువ్వేం సీతవా, సావిత్రివా, ఆఫ్టాల్ సాధారణ స్త్రీవి. అందులోను పదిమంది మగాళ్ళతో పూసుకు తిరుగుతూ నాగరికత అని సరిపెట్టుకొనే ఈ కాలపు ఆడదానివి. " వుద్యోగం చేస్తున్నాను, సంపాయించుకొంటున్నాను, మగాడితో లెక్కేవిటని " విర్రవీగే నారీమణివి.

గీతా : ఛీ, ఛీ మీతో మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ.

ఆనంద్ : నీలాంటి వాళ్ళు ఎంతకైనా సమర్థులు.

మూర్తీ : నన్ను కొట్టండి తిట్టండి. ఈ గడప తొక్కొద్దని శాసించండి, గాని ఆవిడనేమీ అనకండి గీత నాకు అక్కయ్యకాదు, అమ్మ, అమ్మ లాంటిది. ఆ తల్లిమీద అభాండం వేసి ఇంకా కొనవూపిరితో వున్న ధర్మాన్ని గొంతు పిసికి చంపకండి. ప్లీజ్ !

గీతా : మూర్తి, యీ అవమానం నీది కాదు, నాది.

ఆనంద్ : గీతా ....( కోపంగా )

గీతా : తరతరాలుగా మగవాడు ఆడదానిని లొంగదీసుకోవడానికి ప్రయోగించే చివరి అస్త్రం యీ అనుమాన బాణం.

ఆనంద్ : ( ఆవేశంగా ) గీతా ....!

గీతా : ఈ అస్త్ర ప్రయోగంతో ఆడది లొంగిపోయి, మొగుడు చేస్తున్న అడ్డమైన పనులని ఆమోదిస్తుందని ఆయన అభిప్రాయం.

ఆనంద్ : గీత, హద్దుమీరి మాట్లాడుతున్నావు. ( గీతను కొట్టడానికి మీదకు వస్తాడు గీతమీద దెబ్బ పడుతుందని గ్రహించిన మూర్తి క్షణములో గీతను పక్కకు లాగి ఆ దెబ్బ తను తింటాడు )

గీత : అవునండీ ఏనాడైతే మగాళ్ళకు నీతి నియామలు అనేవిపోయాయో ఆ నాటినుంచే

ఆడవాళ్ళు కట్టుబాట్లు అనేవి కట్టుకున్న వాడికోసం కాక తమకోసమే అన్న స్థితికి ఎదిగారు.అందుకే నేను ఉద్యోగం చేస్తున్నాను. కాని దీనివల్ల మీరెంతగా పాడయిపోయారో నైతికంగా ఎంత దిగజారిపోయారో నాకు అర్ధమవుతోంది. దీనికి కారణం ఏమిటో పరిష్కారమేమిటో కూడా నాకు తెలుసు. నిజం నిలకడమీద మీకే తెలుస్తుంది.

( ఆవేశంగా ప్రక్కనే వున్న టేబిల్ మీద కూర్చుని ఏదో వ్రాస్తుండగా )

మూర్తి : నన్ను క్షమించండి, యీ అనర్ధాలన్నిటికి కారణం నేనే.

ఆనంద్ : అవును. నువ్వే..... నువ్వే కారణం. హాయిగా వున్న మా యిద్దరి మధ్య కలతలకి కారణం నువ్వే. నిజంగా గీతని అక్కయ్యగా నువ్వు భావిస్తుంటే మళ్ళీ యీ గడప త్రొక్కకు. నీ మొహం చూపించకు. వెళ్ళు.

మూర్తి : వెళ్తాను. అక్కయ్యగారికోసం ఏమన్నా చేస్తాను. మళ్ళీ యిటు రాను. మీక్కనిపించను శలవు. ( ఈ దశలో గీత వ్రాయడం పూర్తిచేసి కాగితాన్ని చేత్తో పుచ్చుకొని స్టేజీ మధ్యకు వస్తుంటే సరిగ్గా అదే సమయానికి కోదండరామయ్య ప్రవేశిస్తాడు అందరూ ఆయన వంకే చూస్తారు. గీత ఏదో మాట్లాడబోగా చేత్తోనే వారిస్తూ )

కోదండం : ఆగండి, ఎవ్వరూ మాట్లాడటానికి వీలులేదు. మూర్తీ నువ్వూ యిక్కడనుంచి కదలటానికి వీలులేదు. నీ వల్ల ఆ గీతమ్మ మీద పడిన మచ్చ తొలిగిపోయేవరకు నువ్వెక్కడికి వెళ్ళకూడదు. అలా నిలబడు. ( మూర్తి ఒక ప్రక్కగా తలొంచుకుని నిలబడుతాడు కోదంరామయ్యని చూడగానే గీతకు దు:ఖం ముంచుకురాగా కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది ) అమ్మా గీతా బాధపడకు. నీకు నేనున్నాను. ( అంటూ గీత భుజంపై చెయ్యివేసి అనందరావు వద్దకు తీసుకువచ్చి ) ఆనందరావు నువ్వు చదువుకున్నవాడి. తెలివిగలవాడివి. మంచివాడవనుకున్నానేగాని యింత అసమర్ధుడవనుకోలేదు. నువ్వు పేకాడతావని, గుర్రప్పందాలు కడతావని, నీ వ్యసనాలకోసం వూరంతా అప్పులు చేస్తున్నావని, మొన్న ఆఫీసులో నిన్నెవరో కొట్టబోయారని కూడా తెల్సు.

ఆనంద్ : ఎవడా చెప్పిన వెధవ ?

కోదండం : ఎవడో, కాని యింతవరకూ ఆ విషయం నిన్నడిగానా కనీసం అమ్మాయితో కూడా అనలేదే. కారణం అవన్నీ నీ వ్యక్తిగత విషయాలు. కాని యిప్పుడు నువ్వు

చేసింది అమానుషం. ఇది నీ ఒక్కడి వ్యక్తిగత విషయం ఎంత మాత్రం కాదు. ఈ సమస్య మీ ముగ్గురుదీనూ. గీత నాకు కూతురులాంటిది, యీామె మీద అభాండం వేస్తే నేను సహించలేను.

ఆనంద్ : మీకు విషయాలు పూర్తిగా తెలియవు. వాళ్ళు.....

కోదండం : నువ్వేం చెప్పక్కర్లేదు. నాకంతాతెల్సు. అన్నీ విన్నాను. గీత నీకు భార్యగానే తెల్సు. కష్టంలో వున్నవారిని చూసి విలవిల్లాడే మానవతామూర్తిగా నాకు తెలుసు. నువ్వు బస్సులో ఆఫీసుకెడుతుంటే, అవస్తపడుతున్నావని ప్రతినెలా తన జీతంలో రెండొందలు పొదుపుచేస్తూ నీకు స్కూటరు కొనిపెట్టాలని ప్రయత్నం చేస్తున్న పిచ్చి పెళ్ళాంగా తెలుసు. ఆమెకుద్యోగం లేని రోజుల్లో నువ్వేదో సంసారం కోసం కష్టపడిపోతున్నావన్న అభిమానంతో నిన్నెలా సుఖపెట్టాలా అని అహర్నిశలూ ఆలోచించే ఆ మమతలమూర్తినే శంకించావా ?

ఆనంద్ : అలాగయితే మరి నేను సుఖపడుతున్నానని ఎందుకంత రాద్ధాంతం చేస్తుంది ?

కోదండం : వ్యసనాలకు లోనై యిల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకోవడం సుఖపడటమా, ఎంతమాత్రం కాదు. దాన్ని సుఖపడటమనరు. పాడయిపోవడం, పతనమైపోవటమంటారు. ఆనంద్‌రావ్ , నే చెప్పేది శాంతంగా విను. ప్రేమున్నచోటే బాధ కూడా వుంటుంది. నిన్ను ప్రేమిస్తోంది గనుకనే నువు పాడైపోతున్నావని బాధపడుతోంది.నువ్వు అనుకుంటున్నట్లుగా ఆమెకి మూర్తితో సంబంధమే వుంటే, నువ్వు వ్యసనాలకి లోనవుతున్నావని బాధపడేది కాదు. పైగా నీ క్కావలసినంత డబ్బిచ్చి ప్రోత్సహించి తన అడ్డుతొలగించుకునేది. ఆనందరావ్ – అటు చూడు నువ్వు అనాలోచితంగా అన్నమాట ఆ రెండు గుండెలనెలా దహించి వేస్తోందో ఒక్క సారి చూడు. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. వారిద్దరికి క్షమాపణ చెప్పుకొని నువ్వూ ఒక మనిషివేనని రుజువు చేసుకో. అలా చెప్పని పక్షంలో తక్షణం నా యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపో,

గీతా : ( కళ్ళు తుడుచుకుని ముందుకొస్తూ ) మీరు పొరపడుతున్నారు బాబాయిగారు. కేవలం యిల్లు మార్చినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. ఈ సమస్యను

మీరు పరిష్కరించలేరు. వారి మనసు మార్చే పరిష్కారం యీ కాగితంలో వుంది.
మూర్తి – యీ కాగితాన్ని మా ఆఫీసుకు చేరుస్తావా ?
( మూర్తి ముందుకొచ్చి కాగితాన్ని అనుమానంగా విప్పి చదువుతాడు. అతని మొహంలో రంగులు మారుతాయి )

కోదండం : ఏమిటమ్మా ఆ కాగితం. అందులో ఏం వుంది. ?

మూర్తి : అక్కయ్య ఉద్యోగానికి రాజీనామ చేస్తోంది.
( అందరూ ఆశ్చర్యంగా ఆమె వంక చూస్తారు )

కోదండం : అమ్మాయ్. నువ్వు తొందర పడుతున్నావ్. అయినా నీ వుద్యోగం ఏం చేసిందమ్మా మధ్యలో.

గీతా : బాబాయ్‌గారూ మీకు తెలీదు. ఈ కలతలన్నిటికీ నా ఉద్యోగమే కారణం. నా సంపాదనే నా సంసారంలో నిప్పులు పోస్తోంది.

కోదండం : అబ్బే అలా అంటే నేనొప్పుకోను. ఆవేశంలో చేసిన తప్పులకి తీరుబడడిగా బాధపడాల్సి వుంటుంది. ( ఆనందరావునుద్దేశించి ) నువు మాట్లాడకుండా నిమ్మకు నీరెత్తినట్లు అలా నిల్చుండిపోతావేమయ్యా, రాజీనామా చెయ్యొద్దని ఒక్కమాట కూడా అనవేం ?

ఆనంద్ : గీత, ఎదుటి వ్యక్తిపైగల కోపంతో నీ కొంగుకి నిప్పంటించుకోవడం తెలివిగల వాళ్ళలక్షణం కాదు. ఆలోచించు,
( ఆ మాట వినగానే గీత ఏడుస్తూ ఒక్క పరుగున ఆనదంరావుని సమీపించి అతని చేతులు పుచ్చుకొని )

గీతా : ఏవండీ, నాకీ ఉద్యోగం వద్దు, సంపాదనొద్దు, ఏమీ వద్దండి. కాని మీరు కావాలి, మీ ప్రేమకావాలి. మీ ఆదరణ కావాలి. వీటికోసం ఏదైనా త్యాగం చేస్తానండి. యిందాక మీరు నా మీద వేసిన నింద నిజంగా మీ గుండెలలోంచే వచ్చిందా ? నిజం చెప్పండి. మీరు నమ్మిన ఆ దేవుని మీద ప్రమాణం చేసి ,చెప్పండి. మీరు నిజమే నంటే, మీ ఎదుటినుంచే కాక, జీవితంలోంచే తప్పుకుంటాను. చెప్పండి
( ఆనందరావు రెండు క్షణాలు ఆమె కళ్ళలోకి చూచి దూరంగా వెళ్ళి నిలబడ్డాడేగాని ఏమీ మాట్లాడలేదు )

కోదండం : చెప్పవయ్యా, నీ మీద నాకు ఏమీ అనుమానం లేదని ఒక్కమాట చెప్పి నీ సంసారాన్ని నిలబెట్టుకో.

ఆనంద్ : బెదిరింపులకి ఒత్తిడులకి లొంగిపోయేవాడిని కాను. మొసలి కనీళ్ళకు కరిగిపోయేవాడిని అంతకంటే కాదు.

కోదండం : అబ్బాయ్ నీవు మరీ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావోయ్.

గీతా :యింక ఆయననేమీ అనకండి బాబాయ్‌గారూ. తన వుద్దేశాన్ని స్పష్టంగా చెప్పారు.

( అంటూ గీత చర చరా లోనికి వెళ్ళి పోయింది. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. తరువాత కోదండరామయ్య తనలో తాను అనుకుంటున్నట్లుగా )

కోదండం : ఛీ, ఛీ,ఛీ....ఏం కాలం ఏం మనుష్యులు, భార్య భర్తల మధ్య అవగాహన వుండదు. తల్లీబిడ్డల మధ్య శత్రుత్వం, నీతి, ధర్మం, న్యాయం అనేవి కంచుకాగడా పెట్టి వెతికినా కనిపించడం లేదు. భగవంతుడా ఏమిటీ విపరీతం ?

( అంతలో గీత పెట్టె పట్టుకొని వచ్చింది )

గీతా ఏమిటమ్మా నీవు చేస్తున్నది. ఎక్కడికి ప్రయాణం ?

గీతా : మూడు ముళ్ళబంధంతో చిక్కుకున్న యీ ముళ్ళపంజరం నుంచి విశాలమైన స్వేఛ్ఛా ప్రపంచంలోకి.

మూర్తి : పెంచుకొని పెనవేసుకోవాల్సిన బంధాన్ని తెంచేసుకుంటున్నారా, వద్దు సంసారాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దు.

గీతా : మూర్తి నువ్వూ అలానే అంటున్నావా ? అవున్లే నువ్వూ మగాడివేగా. కొట్టినా తిట్టినా అపనిందలేసినా ఆడదాని స్ధానం మొగాడి పాదాల దగ్గరేన్న కాలంపోయింది మూర్తీ. ఆడది యిప్పుడు మగాడికి ఏ విషయంలోనూ తీసిపోదు. అర్ధం లేకుండా అపనిందలు వేసి అవమానాలు చేస్తున్నా – ఏవండీ మీ పాదాల దగ్గిర కాస్త చోటివ్వండి అని బ్రతిమాలేందుకు యిది మంత్రయుగం కాదు యంత్రయుగం.

కోదండం : అమ్మాయ్ నీకేమన్నా పిచ్చిపట్టిందా ? వుద్యోగం వదులుకొని సంసారం వదులుకొని ఏం చేద్దామని ? ఎక్కడుందామని ?

గీతా : కేవలం వుద్యోగాన్ని చూచుకొని మిడిసిపాటుతో భర్తని కాదని వెళ్ళిందనే అపకీర్తి నా కొద్దు బాబాయ్‌గారు. నేనాయనకు దూరంగా వెళ్ళేది మిడిసిపాటుతో కాదు.

అవమానభారంతో నా పుట్టింటికి.

కోదండం : నీ పుట్టింటికా, నీ దోరణి నాకు ఏమీ అర్ధం కావడంలేదు, ఏమిటమ్మా యీ పంతాలు. జీవితాలతో చెలగాటమాడుకొంటున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు జాలేస్తున్నది.

గీతా : ఏవండీ...నేను వెళుతున్నాను. నా మనస్సే నాకు సాక్షి. నేనేం తప్పుచేయలేదు, చేయను, మూర్తి నా తమ్ముడు. యివన్నీ మీకు యిప్పుడు చెప్పినా అర్దం కావు. అందుకే వెళుతున్నాను. మీ పిలుపు కోసం ప్రతిక్షణం ఎదురుచూస్తుంటాను. శెలవు.

( గీత బయటకు వెళ్ళిపోతుంది. ఆనందరావు లోనికి వెళ్ళిపోతాడు. మూర్తి జేబులోనుంచి రాజీనామా కాగితం తీసి ఒకసారి చూచి ఆవేశంగా ఆనందరావు వెళ్ళినవైపు , గీత వెళ్ళినవైపు , చూస్తుంటాడు. కోదండరామయ్య విచారంగా ముందుకువచ్చి )

కోదండం : అయిపోయింది. అంతా అయిపోయింది. పచ్చని సంసారంలో భగ్గున మంటలేచింది. చిలకా గోరింకలు చెరోవైపు ఎగిరి పోయాయి. ఆవేశమేకాని ఆలోచన లేని యీ యువతరాన్ని నువ్వే కాపాడాలి భగవంతుడా.....

**( లైట్స్ ఆఫ్ )**

( విలువైన ఫర్నీచరు అంతాపోయి స్టేజీ నిరాడంబరంగా వుంటుంది. కోదండరామయ్య పచార్లు చేస్తూవుంటాడు. )

**( లైట్స్ ఆన్ )**

కోదండం : ( స్వగతం ) తర తరాలుగా మగవాడు ఆడదానిని బానిసగా చేసుకొని ఎన్నో విధాల ఎన్నెన్నో రకాలుగా ఏడ్పించి కష్టాలపాల్చేశాడని చరిత్ర చెప్తున్న కఠిన సత్యం. మారుతున్న కాలంతో పాటు మగవాడి ఆలోచనా ధోరణి గూడా మారుతుంటుంది. ఈనాడు సమాన హక్కుల మిషతో ఆడవాళ్ళని వుద్యోగాలవైపు ప్రోత్సహించి, సంసారపు బాధ్యతలని వాళ్ళ భుజస్కందాలపై పడేసి, తనుమాత్రం విచ్చలవిడిగా బాధ్యతారహితంగా తిరిగి పతనమైపోతున్నాడు. అటువంటి మగవాళ్ళ ఆటలు కట్టాలన్నా, వాళ్ళరాతలు మారాలన్నా గీతలాంటి భార్యలుండాలి. ఆ రోజుల్లో పెళ్ళికావాల్సిన ప్రతి మగవాడికీ వుద్యోగం చేస్తున్న

అమ్మాయే కావాలి. ఎందువల్ల ? మగవాళ్ళకి వాళ్ళమీద వాళ్ళ శక్తి మీద వాళ్ళకే నమ్మకం లేక. భార్య సంపాదన అడ్డం పెట్టుకుని అన్ని వ్యసనాలకూ బానిసలవుతున్న మొగుళ్ళతో , వాళ్ళని నమ్ముకున్న యీ ఆడవాళ్ళు ఏం సుఖపడతారు ? రాత్రి 12 గంటలకు తప్ప తాగి యింటికొచ్చిన భర్తని, ప్రక్కవాళ్ళు చూడకుండా తలుపులు తీసి, లోనికి లాక్కునే పతివ్రతా ధర్మం గురించీ , అలాగే వెర్రి తలలు వేసిన నాగరికత ముసుగులో, మొగుడెలాపోతే నాకెందుకని పట్టనట్టు కూర్చున్న పడతుల గురించి మనకనవసరం. ఆలోచన మనిషిని పెంచుతుంది. ఆడదానికి తనకి తానుగా ఆలోచించుకునే భావస్వాతంత్ర్యం కావాలి. మంచిదో , చెడుదో నిర్ణయించుకోగల విజ్ఞత సామర్ధ్యం సంపాయించుకోవాలి. ఒక్క సమస్యకి ఎన్నో రకాల పరిష్కారాలుండొచ్చు. కాని యీ సమస్యకు యిదే పరిష్కారమనటం, సబబు కాదు. మొగుడు, సంసారం , పరువు , ప్రతిష్ట అని పడిచచ్చే గీతలాంటి వెర్రిబాగుల ఆడపడుచుల జీవితాలు బాగుపడాలన్నా , వాళ్ళ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అనుభవం పేరుతో పతనమైపోతున్న మొగుళ్ళని రక్షించుకోవాలన్నా ఆడది వుద్యోగం మానుకుని యింటిపట్టునుండటం వుత్తమమని గీత తీసుకున్న నిర్ణయం మంచిదే. కాని వుద్యోగం మానేస్తే ఆనందరావులాంటి వాళ్ళ ఆటలు మరీ మితిమీరిపోతాయి. తన సంసార ప్రభావం కేవలం తనొక్కడిమీదే వుందన్న నైతిక బాధ్యత పెరిగిపోయి అతనిని కారుచిచ్చులా ప్రతిక్షణం కాల్చేసి మళ్ళీ మనిషిని చేస్తుంది. ఆడది లేని యిల్లు కేసుల్లేని కోర్టులా వుంటుందని ఆనందరావుపట్ల పూర్తిగా నిజమైంది. ఆఫీసు డబ్బు వాడేసుకున్నాడన్న నేరారోపణపై వుద్యోగం ఊడిపోయింది. అమ్మాయికూడా వూరునుంచి రాలేదు. రెండు నెలలుగా అద్దె కట్టలేదు. మూడు రోజులుగా పస్తులు, చాలా సంకట స్థితిలో వున్నాడు. ఏం చేస్తాడో ఏమిటో ?

( అంటూ లోపలికి వెళ్ళబోయేసరికి బట్టలు మాసి, పెరిగిన గెడ్డంతో ఆనందరావు దగ్గుతూ ప్రవేశిస్తాడు )

ఎంతపని జరిగిపోయింది. ఎంతపని జరిగిపోయింది. అయినా ఆఫీసు డబ్బు వాడుకునేటంతటి అవసరాలేమిటయ్యా. యిలా ఎన్నాళ్ళు కూర్చుంటావు ? పోనీ అమ్మాయిని పిలిపించనా ?

ఆనంద్ : ( దగ్గుతూనే ) వద్దు, వద్దు ఆ పని మాత్రం చేయబోకండి. గీత ఎదుటపడి ఆమె కళ్ళల్లోకి చూడలేను. ఆమెను క్షమించమని అడుగలేను. నన్ను యిలాగే రాలిపోనివ్వండి.

కోదండం : యింకా నీవు అమ్మాయి మనస్సు అర్థం చేసుకోలేదుగాని నీ పరిస్థితి యిలా వుందని తెలిస్తే ఎవరూ పిలవనక్కరలేదు. తనే పరిగెత్తుకొస్తుంది.

ఆనంద్ : నేను ఆమెకు చేసిన ద్రోహానికి, వేసిన నిందకి, గీతకాదు , ఏ ఆడది మళ్ళీ ఆ మగాడివంక కన్నెత్తి చూడదు. నాకా అదృష్టం లేదు.

( అంతలో మూర్తి, గీత ప్రవేశిస్తారు )

మూర్తి : బావగారూ, మీ అదృష్టం బహు గొప్పది. అక్కయ్య వచ్చేసింది.

( ఆనందరావు ఒక ప్రక్క, గీత మరొక ప్రక్క నిల్చున్నారు. కోదండరామయ్య వాళ్ళిద్దరికి మధ్యగా వున్నాడు. ఆనందరావు గీత వంక చూచి తలొంచుకున్నాడు. గీత ఒక్క పరుగున ఆనందరావు వద్దకు వెళ్ళి )

గీతా : ఏవండీ, ఏవిటిలా అయిపోయారు. అన్నం తినడంలేదా ? అయ్యయ్యో బట్టలు మాసి, గెడ్డం పెరిగి అలా వున్నారేవిటండీ, మాట్లాడండీ ( ఏడుస్తుంది )

ఆనంద్ : గీతా నువ్వు అలా ప్రేమగా మాట్లాడకు, నన్ను తిట్టు, నీ యిష్టం వచ్చినట్లు శిక్షించు. అందరూ నన్ను చూచి నవ్వండి. కాని నా మీద జాలి మాత్రం చూపొద్దు. యిప్పుడు జాలి విషంలా పనిచేసి నన్ను చంపేస్తుంది.

గీతా : నే వెళితే హాయిగా వుంటారని వెళ్ళానండి. యిలా జరుగుతుందనుకుంటే అసలు వెళ్ళేదాన్నే కాదు.

కోదండం : చూశావా ఆనందరావ్ ! అదీ గీత మనస్సు. నువ్వన్న మాటలు, చేసిన పనులు, వేసిన నిందలూ అన్నీ మర్చిపోయి కేవలం నీవు చిక్కిపోయావని బాధపడుతోంది పిచ్చిపిల్ల. ( విచారంగా ) అమ్మాయ్ గీత, అబ్బాయికి ఉద్యోగం పోయిందమ్మా.

గీతా :త విన్నాను బాబాయ్‌గారు. మూర్తి చెప్పాడు. ఏం చేయాలో తెలియడం లేదు.

కోదండం : యిప్పుడు నీకు ఉద్యోగం వుంటే ఎంత హాయిగా వుండేది. ఆవేశంలో వుద్యోగానికి రాజీనామా చేశావు. అందుకేనమ్మా ఆడదానికి కూడా ఉద్యోగం వుండాలనేది.

ఆనంద్ : అన్నింటికి నేనే కారణం. నా మూర్ఖత్వం, అహంభావం నన్నే దెబ్బకొట్టాయి. నా

కళ్ళు ఆలస్యంగా తెరుచుకున్నాయి. గీతా నన్ను క్షమిస్తావా. దేవతలాంటి నీ మీద అపనింద మోపినందుకు నాకు భగవంతుడు మంచి శిక్ష వేశాడు.

గీతా : అలా అనకండి. నా నిజాయితీని గుర్తించారు అదే చాలు. ఆలుమగలు మధ్య సామరస్యం వుంటే బ్రతకడం పెద్ద కష్టం కాదు. నేను మళ్ళీ వుద్యోగం చూసుకొంటాను.

కోదండం : మళ్ళీ మీకు ఉద్యోగాలు రావాలంటే మాటలా, యిద్దరూ కూలిపని చేసుకొని బ్రతకండి.

మూర్తి : మా అక్కయ్యకు అంత గతి పట్టనిస్తానా. ఆవిడ వుద్యోగం నిక్షేపంగా వుంది.

కోదండం : ఏమిటి నువ్వంటున్నది ?

మూర్తి : అక్కయ్య రాజీనామా కాగితం యింకా నా దగ్గరే వుంది యిదిగో
( అంటూ జేబులోంచి కాగితం తీసి చూపిస్తాడు )

గీతా : మూర్తీ ఆ కాగితం మా ఆఫీసులో యివ్వలేదా ? ( ఆత్రంగా )

ఆనంద్ : మూర్తి నీవు నిజంగా దేవుడివి. మా సంసారం రోడ్డుకెక్కకుండా కాపాడావు.

కోదండం : ఆ పొగడ్తలన్నీ మూర్తికే యివ్వకండి. నాకూ వాటా వున్నది. యిద్దరం కలిసే చేసాం.

మూర్తి : నన్ను క్షమించు అక్కయ్య. చూస్తూ చూస్తూ నీవు రాజీనామా చేయడం నాకు యిష్టం లేకపోయింది. ఉద్యోగం లేకపోవడం వల్ల ఎన్నిఅవస్థలు పడాల్సి వస్తుందో నాకు తెలుసుగనుక, నీ నిర్ణయంతో ఏకీభవించలేకపోయాను. ఆడదానికి ఆర్ధిక స్వాతంత్రము కావాలని నా గట్టి నమ్మకం. బాబాయ్‌గారు కూడా నా ఆలోచనను బలపర్చారు.

ఆనంద్ : మూర్తీ ఆనాడు నిన్ను నా సంసారాన్ని పాడుచేశావని నిందించాను, కానీ యీనాడు నీ వల్లే నా సంసారం నిలబడింది. నువ్వు నిజంగాదేవుడివి. నన్ను క్షమిస్తావా ?

మూర్తి : అలా అనకండి. నేను చిన్నవాడిని. క్షమించే అర్హత నాకులేదు. అక్కయ్య సంసారం పాడైపోయిందనీ, దానికి నేనే కారణమని తెల్సుకుని విలవిల్లాడిపోయాను. అక్కయ్య వ్రాసిన రాజీనామా కాగితాన్ని నావద్దే వుంచాను. సుమారు రెండు నెలల క్రిందట బహుశా నేను కూరలు తీసుకొనివచ్చిన రోజనుకుంటా అక్కయ్య ఖాళీ

కాగితం మీద సంతకం చేసి శెలవు వ్రాసి ఆఫీసులో యివ్వమని చెప్పింది. ఆ కాగితం మీద అక్కయ్యకు ఒంట్లో బాగుండటం లేదని, వూళ్ళో కూడా లేదని వ్రాసి బాబాయి గారు తెచ్చిన డాక్టరు సర్టిఫికేట్ జతచేసి ఆఫీసులో యిచ్చాను. అంతా సవ్యంగా జరిగింది. చాలా సంతోషంగా వుంది.

గీతా : మూర్తీ నాకు చాలా సహాయం చేశావు. నీ మేలు జన్మలో మర్చిపోలేను.

ఆనంద్ : మూర్తీ నీవు గీతకు కాదు నాకు తమ్ముడివి.

కోదండం : సర్లేవయ్యా నీకేమిటి, ప్రపంచానికే తమ్ముడు , సరేనా ! లోపలకు వెళ్ళి గెడ్డం గీసుకొని, బట్టలు మార్చుకో. యిదుగో ఆనందరావూ యీ మధ్య మా ప్లీడరు గారు కేసులు రావడంలేదని బాధపడుతున్నాడు. నీ ఉద్యోగం పోయింది కదా. అంచేత నీ కేసు మేము పుచ్చుకొని నీ ఉద్యోగం నీ కిప్పించడానికి ప్రయత్నిస్తాం. కాని మళ్ళీ కుప్పిగంతులేవీ వేయనని మాటివ్వాలి.

ఆనంద్ : ఇంకా నన్ను పరీక్షిస్తున్నారా. పూర్తిగా మారిపోయాను. నన్ను నమ్మండి.

కోదండం : చూడబ్బాయ్ మూర్తీ. ప్రతిరోజూ పేపరు రాగానే వాంటెడ్ కాలం చూసిస్తానంటూ నువ్విబ్బందిపడి మమ్మల్ని యిబ్బంది పెట్టకుండా రేపటినుండి వాంటెడ్ కాలం చూచుకొని న్యూస్ పేపర్లు యింటికీ యిచ్చే పని తాత్కాలికంగా ఏర్పాటు చేశాను.

మూర్తి : చాలా థాంక్సు అండీ. మరి సైకిలో.....

కోదండం : ఏమిటీ సైకిలా ! నా పెళ్ళికి మా అత్తగారు కొనిచ్చిన సైకిలు అటక మీద వుందోయ్. అది బాగుచేయించి నీకిస్తాను. మంచి వుద్యోగం వచ్చేవరకు అది వాడుకో. చూడబ్బాయ్ మూర్తీ ! భార్య సంపాదన గోడకు నిచ్చెన లాంటిది దానిని ఆధారం చేసుకొని భర్తలు తమ సంసారాన్ని పైకి తీసుకెళ్ళి ,ఆనందాల్ని అందుకోవాలేగాని వ్యసనపరులై ఆనందరావులా పతనమై, సంసారాలను నాశనం చేసుకోకూడదు.

గీతా : బాబాయ్‌గారు ! మీ ఋణం మేమెలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదు.

కోదండం : దానికేముంది పాతిక రూపాయలు అద్దె పెంచవమ్మా సరిపోతుంది.

( అందరూ నవ్వుతుండగా తెర )

----- శుభం -----